మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆర్.పి.(రిసోర్స్‌పర్సన్)లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో రూ.5 వేల కోట్లతో మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆర్పీలు స్వయం సహాయక సంఘాల మహిళలతో గ్రూప్‌లుగా ఏర్పడి వివిధ రకాల యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలన్నారు. సమావేశంలో కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, ఏపీఎం నరసింహ, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన పెండింగ్ బిల్లులు చెల్లించండి



మంత్రికి వినతి అందజేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, నాయకులు

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనుల పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య ఆధ్వర్యంలో రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. వంతెన పనుల కోసం ఏర్పాటు చేసిన పిల్లర్లతో ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం, స్థానిక వ్యాపారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించి పనులు కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై మంత్రి స్పందించి పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత మీదే

ల్యాండ్ సర్వే అధికారులతో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలంలో సర్వే ల్యాండ్ కింద పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను పర్యవేక్షించే బాధ్యత సర్వేయర్లపై ఉందన్నారు. ప్రతి మండలంలోనూ ప్రభుత్వ భూములను గుర్తించాలని కోరారు. సెంటు భూమి కూడా అన్యక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ ,డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి రెయిన్ కోట్ల పంపిణీ

పోచారం: మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బందికి రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కొండారెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాలంలో సిబ్బందికి ఇబ్బంది కలగకుండా 230 మందికి రెయిన్ కోట్స్ అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వేమన్‌రెడ్డి, కౌన్సిలర్లు మహేష్, హరిప్రసాదరావు, మాజీ ఉప సర్పంచ్ ఆకిటి బాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌కు అభినందనలు



మేయర్‌తో కీసర మండల కాంగ్రెస్ నేతలు

కీసర: బోడుప్పల్ మేయర్‌గా ఎన్నికైన తోటకూర అజయ్‌యాదవ్‌ను మంగళవారం కీసర మండల కాంగ్రెస్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నేతలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బెలిదే రమేష్ గుప్తా, మచ్చాని జంగయ్య యాదవ్, రాయిల శ్రావన్‌కుమార్, తటాకం లక్ష్మన్, చిక్కుడు రమేష్, శంకర్‌గౌడ్, ముద్దం వెంకటేష్, ప్రవీణ్ ముదిరాజ్, బాలమణి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలను నివారించండి



ఎన్టీపీసీ చౌరస్తాను పరిశీలిస్తున్న అధికారులు

పోచారం: అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా ప్రమాదాలకు నిలయంగా మారిన నేపథ్యంలో నివారణ చర్యలు చేపట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు, జాతీయ రహదారుల అధికారులు మంగళవారం పరిశీలించారు. అండర్ పాస్ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చైర్మన్ కొండల్‌రెడ్డి అధికారులకు వివరించారు. ప్రమాదల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని వారిని కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ.. డివైడర్ మధ్యలో ఇనుప కంచె ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, జాతీయ రహదారి సిబ్బంది, మాజీ ఉప సర్పంచ్ ఆకిటి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులపై నజర్

పకడ్బందీగా క్లినిక్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టం అమలు

- అధిక ఫీజులపై చట్టపరమైన చర్యలు
- ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్స్, స్కానింగ్ కేంద్రాల్లో చికిత్స, వైద్య పరీక్షల వ్యయ పట్టిక తప్పనిసరి
- అనుమతి లేని వారు సత్వరమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం
- నగర శివారుల్లో పుట్టగొడుగుల్లా ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్లు తదితరాలు



మేడ్చల్‌లో అనుమతిలేని స్కానింగ్ సెంటర్లు కొనసాగుతున్న భవనం (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: అనుమతులు లేకుండా వైద్య సేవలు అందిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే ప్రైవేట్ ఆసుపత్రులపై వైద్యాధికారులు ఇకపై కొరఢా ఝులిపించనున్నారు. ఈ నేపథ్యంలోనే 'క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం-2010, నిబంధనలు-2022'ను పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఇటీవల జిల్లా వైద్యాధికారులతో చట్టం అమలు తీరుపై పలు సూచనల చేయడమేగాక స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

అనుమతులకు నిబంధనలు ఇలా...

అల్లోపతి ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, కన్సల్టెంట్ క్లినిక్‌లు, ఆయుష్ క్లినిక్‌లు, ఫిజియోథెరపి కేంద్రాలకు అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం జిల్లా వైద్యఆరోగ్యశాఖలో దరఖాస్తు చేసుకోవాలి. అలా దరఖాస్తు చేసుకున్న ఆసుపత్రి, క్లినిక్. డయాగ్నస్టిక్ కేంద్రాల నిర్వాహకులు అందులో పనిచేసే వైద్యుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి. అగ్నిమాపక, బయో వేస్ట్ మేనేజ్‌మెంట్, పొల్యూషన్, ట్రేడ్ లైసెన్స్‌తో సహా అన్నిరకాల పత్రాలు సరిగ్గా ఉన్నప్పుడే ఆసుపత్రుల ఏర్పాటుకు అనుమతి మంజూరు చేస్తారు.

అనుమతి లేకపోతే సీజ్ చేస్తాం

ఎలాంటి అనుమతులు లేకుండా బోగస్ ధ్రువపత్రాలతో వైద్యం చేస్తే ఆసుపత్రులను సీజ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. అనుమతులు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. క్వాలిఫైడ్ డాక్టర్లు, నర్సులు , ఫార్మసిస్టులతోనే ఆసుపత్రులను నడపాలి. చట్టంలో పొందుపర్చిన ప్రకారం ఆసుపత్రుల్లో ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలి.

– డాక్టర్. రఘునాథస్వామి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

శివారుల్లో పుట్ట గొడుగుల్లా ...

నగర శివారు మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో 15 మండలాలు, 13 పురపాలక సంఘాలు ,61 గ్రామ పంచాయతీలు ఉండగా, ఆయా ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు డయాగ్నస్టిక్స్, స్కానింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటిలో కొన్నింటికి మాత్రమే అనుమతులున్నాయి. మిగతా వాటికి లేకున్నా.. వైద్య సేవలు కొనసాగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో మరణాలు సంభవించాక విచారణకు వెళ్లే వైద్యాధికారులకు సదరు ఆసుపత్రి లేదా, చికిత్స చేసేందుకు వైద్యుడికి అనుమతి లేదని గుర్తించి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని' పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అనుమతి లేనివెన్నో..?

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2,600 పైగా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు ఉండగా, ఇందులో రిజిస్ట్రేషన్‌తో సహా పలు రకాల అనుమతులతో కొనసాగుతున్న ఆసుపత్రులు 1705 మాత్రమే ఉన్నాయి. ఎలాంటి అనుమతి లేని ప్రైవేట్ ఆసుపత్రులు 895 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ అంచనా వేస్తోంది. అనుమతులు ఉన్న ఆసుపత్రుల్లో వంద కంటే ఎక్కువ పడకలు(బెడ్స్) ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు 48 ఉండగా, 20 నుంచి 100 పడకలు(బెడ్స్) ఉన్న ఆస్పత్రులు 317 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ పేర్కొంటోంది. 20 పడకలు (బెడ్స్) ఉన్న ఆస్పత్రులు 294 ఉన్నాయి. అలాగే, 712 పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు,180 డెంటల్ ఆస్పత్రులు, 46 ఫిజియోథెరపీ సెంటర్లు, 08 రిహాబిలిటేషన్ సెంటర్లు ఉన్నాయి. అలాగే అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లు 628 ఉండగా అక్రమంగా కొనసాగుతున్న స్కానింగ్ సెంటర్లు 400 వరకు ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.



నోటీసులు అందజేస్తున్న అధికారులు (ఫైల్)

వ్యయ పట్టికలు తప్పని సరి..

నగర శివారు ప్రైవేట్ ,కార్పొరేట్ ఆసుపత్రుల్లో అధిక ఫీజుల వసూళ్లు మొదలు వైద్య పరీక్షలు తదితర వాటిల్లో కొనసాగుతున్న దోపిడీని పసిగట్టిన జిల్లా వైద్యారోగ్య శాఖ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రతి ఆసుపత్రిలో డయాగ్నస్టిక్స్, స్కానింగ్ కేంద్రాల్లో చికిత్స, వైద్య పరీక్షలకు అయ్యే వ్యయ పట్టిక ఏర్పాటు చేయాలి. లింగ నిర్ధారణ చేయమని బోర్డులు ఏర్పాటు చేయాలి. డాక్టర్లు, సిబ్బంది, బెడ్ల(పడక మంచాలు) సంఖ్య వంటి సమాచారాన్ని పొందుపర్చాల్సి ఉంటోంది. డయాగ్నోస్టిక్ కేంద్రాలు, ఆసుపత్రుల్లో అర్హత గల వైద్యులు, సాంకేతిక నిపుణులను నియమించుకోవాలి. కన్సల్టేషన్ వైద్యుడిని రప్పించి వైద్యం అందిస్తే అందుకు సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలి. క్రమం తప్పకుండా ఫారం-ఎఫ్‌ను సమర్పించాలి.


వంతెన పనుల పరిశీలన



ఘట్‌కేసర్‌లో ప్రారంభమైన రైల్వే వంతెన పనులు

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులను కాంట్రాక్టర్‌తో కలిసి స్థానిక నాయకులు మంగళవారం పరిశీలించారు. వంతెన పిల్లర్లకు ఇరువైపుల నుంచి వాహనాలు ప్రయాణించడానికి అనువుగా కమిషనర్ సాబేర్ అలీ అక్రమ కట్టడాలను సోమవారం కూల్చివేయించగా ద్విచక్రవాహనాలు రాకపోకల కోసం ఏర్పాటు చేసిన దారిని తిరిగి మూసివేశారు. వంతెన నిర్మాణంపై నాయకులు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు పేరు రావాలన్న ఆకాంక్షతో పనుల్లో జాప్యానికి కారణం అవుతున్నారని విమర్శిస్తున్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ సత్తిరెడ్డి మాట్లాడుతూ పిల్లర్ల డిజైన్ మ్యాపింగ్ కోసం ఆలస్యమైందని, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కార్మికులు సొంత ఇళ్లకు వెళ్లారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు పునః ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, జంగయ్య యాదవ్, కౌన్సిలర్ మల్లేశ్, రాధాకృష్ణ ముదిరాజ్, ఆంజనేయులు, శ్రీనుయాదవ్, ఆంజనేయులుయాదవ్, దేవేందర్‌ముదిరాజ్, సురేశ్, శ్రీనివాస్‌గౌడ్, సిరాజ్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



మిథున్ (ఫైల్)

మేడ్చల్‌రూరల్: మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మాజీద్‌అలీ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మల్కాన్‌సింగ్ బతుకుదెరువు నిమిత్తం నెల రోజుల క్రితం కుటుంబంతో సహా నగరానికి వలసవచ్చి సుతారిగూడలో నివాసం ఉంటున్నాడు. అతని కుమారుడు మిథున్(30) మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. గత మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిన మిథున్ తిరిగి రాలేదు. అతడి కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు మేడ్చల్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్

జవహర్‌నగర్: అక్కను వేధిస్తున్నాడన్న కోపంతో బావను హత్య చేసిన కేసులో పోలీసులు బావమరిదిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జవహర్‌నగర్ పీఎస్ పరిధిలో రాజు అనే వ్యక్తి ఈ నెల 13న మద్యం మత్తులో భార్య, అత్తపై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలియడంతో అతని బావమరిది చందు కోపంతో బావ రాజుపై కర్రతో దాడి చేశా డు. తీవ్రంగా గాయపడిన రాజు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాజు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన జవహర్‌నగర్ పోలీసులు మంగళవారం నిందితుడు చందును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రతి మొక్కను కాపాడాలి

ఘట్‌కేసర్: నాటిన ప్రతి మొక్కను కాపాడాలని ఒకటో వార్డు కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఎన్ఎఫ్‌సీనగర్ ఒకటో వార్డులో ఇంటింటికి ఐదు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ పర్యవరణాన్ని కాపాడడానికి నాటిన మొక్కలను సంరక్షించాలని, పచ్చదనం పెంచడానికి యువత ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రమేశ్, చంద్రశేఖర్, బాబురావు, శ్రీధర్, కన్యాకుమారి, కిరణ్, మున్సిపల్ కార్యలయం సిబ్బంది మారుతి పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ పేరుతో నగదు స్వాహా

ఘట్‌కేసర్: బ్యాంకు ఖాతాకు ఆధార్ కార్డును అప్‌డేట్ చేయాలని నమ్మించి ఖాతాలోని నగదును స్వాహా చేసిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్‌కు చెందిన నర్సింహకు స్థానిక యూనియన్ బ్యాంకులో ఖాతా ఉంది. బ్యాంకు అకౌంట్ ఆధార్ కార్డుతో అప్‌లోడ్ చేయాలని సోమవారం అతడికి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. అందులోని లింకును ఓపెన్ చేసి అప్‌లోడ్ చేశాడు. మంగళవారం ఉదయం అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.60,500 డెబిట్ అయినట్లు మెసేజ్ రావడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పార్కుల అభివృద్ధికి కృషి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో పార్కులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులోని బౌద్ధనగర్‌లో రూ.5 లక్షలతో చేపట్టిన పార్కు ప్రహరీ, పార్కులో ఏర్పాటు చేసిన ఆట వస్తువులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్ లావణ్య శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.



విగ్రహాల తొలగింపు దారుణం

బంజారాల నిరసన



ఆందోళన చేస్తున్నవారితో మాట్లాడుతున్న కమిషనర్ సాబేర్ అలీ

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్ రెండో వార్డులోని పార్కు స్థలంలో గోర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శీతల భవానీ విగ్రహాలను తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బంజారాలు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. శీతల భవానీ దేవతల ఉత్సవం సందర్భంగా తొమ్మిది రోజుల ఉత్సవాల కోసం ఈ నెల 9న తాత్కాలికంగా దేవతా మూర్తులు ఏర్పాటు చేశారు. పూజలు పూర్తికాక ముందే మున్సిపల్ సిబ్బంది విగ్రహాలను తొలగించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా విగ్రహాలు తొలగించి తమ మనోభావాలను దెబ్బతీశారని, తొలగింపు వెనక స్థానిక నాయకుల హస్తం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ సాబేర్ అలీ స్పందిస్తూ సమాచారలోపంతో ఇలా జరిగి ఉంటుందని ఆందోళన చెందవద్దని నచ్చజెప్పారు. నిరసనలో రాములు, పురుషోత్తం, ప్రేమ్‌కుమార్, అనూజ, పార్వతి, రజిత, రాజీ పాల్గొన్నారు.

మహిళా కౌన్సిలర్, మున్సిపల్ సిబ్బందిపై కేసు

ఘట్‌కేసర్: గిరిజనుల దేవతా మూర్తులను తొలగించారన్న ఆరోపణలతో మహిళ కౌన్సిలర్‌తో పాటు మున్సిపల్ సిబ్బందిపై ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక బ్యూటీనెస్ట్ కాలనీలోని పార్కు స్థలంలో గిరిజనులు ఈ నెల 9న తాత్కాలికంగా శీత్లా దేవతా మూర్తులను ప్రతిష్ఠించుకుని పూజలు చేస్తున్నారు. తొమ్మిది రోజుల పండుగ పూర్తి కాకముందే మంగళవారం రెండో వార్డు కౌన్సిలర్ రమాదేవి ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది జేసీబీ సాయంతో విగ్రహాలను తొలగించారు. పార్కును శుభ్రం చేసే పేరుతో దేవతా మూర్తులను తొలగించి తమ మనోభావాలను అగౌరవపరిచారని ఆరోపిస్తూ గోర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాములునాయక్ తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కౌన్సిలర్ రమాదేవి, మున్సిపల్ సిబ్బంది రాజు, మక్బుల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వనమహోత్సవం విజయవంతానికి కృషి

కీసర: వనమహోత్సవంలో భాగంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలను నాటడంతోపాటు, వాటిని పరిరక్షించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంపీడీఓ గ్యామ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని చీర్యాల గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శితోపాటు, సిబ్బందికి తగు సూచనలు చేశారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ ధనలక్ష్మి, విద్యార్థులు

జవహర్‌నగర్: తల్లిదండ్రులు చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ రాజీవ్‌గాంధీనగర్‌లో రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. చిన్నారుల భవిష్యత్తుకు అంగన్‌వాడీ పాఠశాలలు పునాది వేస్తాయన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మనీషా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో మంగళవారం అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి అంగన్వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని తల్లిదండ్రులను కోరారు. కౌన్సిలర్ మహేష్, నాయకులు ఆకిటి బాల్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడదను నివారించండి



మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల బెడదను నివారించాలని బీజేపీ నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గుంపులుగా తిరుగుతున్న కుక్కలు చిన్నారులు, మహిళలపై దాడులకు పాల్పడున్నాయన్నారు. మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌దాస్, బీజేవైఎం అధ్యక్షులు వంశీ, నాయకులు శ్రీకాంత్, రాఘవరెడ్డి, మహేశ్, నర్సిహ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ.. నూతన ఒరవడి

- అంగన్‌వాడీల్లో చిన్నారుల సంఖ్య పెంపునకు కార్యాచరణ
- అమ్మ మాట-అంగన్‌వాడీ బాటకు శ్రీకారం
- 20 వరకు ప్రత్యేక కార్యక్రమాలు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

మేడ్చల్‌రూరల్: పిల్లలకు తొలి ఒడి అమ్మ అయితే...మలి ఒడి అంగన్‌వాడీ కేంద్రాలు కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పూర్వ ప్రాథమిక విద్యను ప్రోత్సహించాలనే భావనతో అమ్మ మాట... అంగన్‌వాడీ బాటను ప్రారంభించింది. ఈ నెల 15 నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు ఈ నెల 20 వరకు కొనసాగనున్నాయి. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా చిన్నారులకు అక్షరాలు, అంకెలు, ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తారు.

కార్యాచరణ ఇలా...

- ఈ నెల 15న అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.
- 16న పిల్లల నమోదు కోసం అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, యువత ,స్వచ్ఛంద సంస్థలు, గ్రామ పెద్దలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.
- 18న ఇంటింటికి తిరిగి రెండున్నరేళ్ల వయస్సు గల చిన్నారులను గుర్తించి, వారిని అంగన్‌వాడీలో చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. అడ్మిషన్లు, ప్రీ స్కూల్ సిలబస్, కార్యక్రమాలు, టైమ్ టేబుల్‌ను తల్లిదండ్రులకు వివరించి చిన్నారుల పేర్లు నమోదు చేస్తారు. ఐదేళ్లు పూర్తయిన వారికి అంగన్‌వాడీ నుంచి ప్రీ స్కూల్ సర్టిఫికెట్ నిస్తారు.
- 19న అంగన్‌వాడీ కేంద్రాలు, పరిసరాలను శుభ్రం చేసి స్వచ్ఛ అంగన్‌వాడీగా తీర్చిదిద్దుతారు. మొక్కలు నాటడం, కిచెన్ గార్డెనింగ్, తాగునీరు, మరుగుదొడ్డి సదుపాయాలు కల్పించడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- 20న ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్‌మెంట్ డే, సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తారు. అంగన్‌వాడీలో బోధన, ఆట వస్తువులను ప్రదర్శించడం, పిల్లల తల్లిదండ్రులను సన్మానించడం తదితర కార్యక్రమాలు చేపడతారు.



చిన్నారుల సంఖ్యను పెంచేందుకు కృషి

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య అమలు చేస్తుండడంతో చిన్నారుల సంఖ్య పెంచేందుకు అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. బడిలో చేరకుండా మిగిలిన వారిని కేంద్రాల్లో చేర్పించేలా దృష్టి సారిస్తున్నాం.

– హైమావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

అందరూ సహకరించాలి...

ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో రోజువారీ కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఇందుకు గాను టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించాం. కార్యక్రమం విజయవంతానికి అందరూ సహకరించాలి.

– ఉదయశ్రీ, ఐసీడీఎస్,సీడీపీఓ